క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



అభిరామ్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జోగులు

రాజాం: మద్రాస్‌లో ఐఐటీ చదువుతున్న స్థానిక పట్టణంలోని బాబానగర్‌కు చెందిన విద్యార్థి పక్కి వెంకటసాయి అభిరామ్ ఇటీవల రైలు ప్రమాదంలో మృతి చెందారు. ఈ మేరకు బాబానగర్‌లోని అతడి స్వగృహానికి ఎమ్మెల్యే బుధవారం వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం విద్యార్థి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, ఓదార్చారు. అంతకుముందు విద్యార్థి చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ రాజాం టౌన్, మండల కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు తదితరులు ఉన్నారు.

చెత్త సేకరణ బుట్టల పంపిణీ



చెత్తసేకరణ బుట్టలు అందజేస్తున్న ఎంపీపీ సన్యాసినాయుడు

మెంటాడ: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని గ్రామ పంచాయతీలకు మంజూరైన చెత్తసేకరణ బుట్టలను సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు చేతులమీదుగా బుధవారం పంపిణీ చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతీ ఇంటికి ఈ బుట్టలు అందించాలని, వీటిలో తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా వేసి, గ్రీన్‌అంబాసిడర్లకు అందించేలా చూడాలని తెలిపారు. గ్రామాల పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా 20,116 ఇళ్లకు గాను 14, 365 చెత్త సేకరణ బుట్టలను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో త్రివిక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామైక్య సంఘాలను బలోపేతం చేయండి



మాట్లాడుతున్న ఏసీ చిరంజీవి

వంగర: గ్రామైక్య సంఘాల బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ ఎ.చిరంజీవి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సంఘం అభివృద్ధికి గ్రామ పేదరిక తగ్గింపు ప్రణాళిక (వీపీఆర్‌పీ), మహిళల జీవనోపాధులు మెరుగుపరిచేందుకు ప్రణాళికలు రూపొందించాలని వీవోఏలకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఎంలు మీసాల చక్రపాణి, బాసిన గోవిందరావు, ఎం.ఎం.ఎస్ ఉపాధ్యక్షురాలు సుమతి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమక్షంలోనే భూముల రీసర్వే



సర్వే సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దారు రాజేశ్వరరావు

బొబ్బిలి: రైతుల సమక్షంలోనే భూముల రీ సర్వే చేపట్టాలని తహసీల్దారు డోల రాజేశ్వరరావు సూచించారు. భూముల రీసర్వేలో భాగంగా మండలంలోని గోపాలరాయుడిపేటలో గ్రౌండ్ ట్రూతింగ్ పనులు బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దారు సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతులు కూడా సర్వే సిబ్బంది సర్వేకు వచ్చినప్పుడు భూ వివరాలు తెలిపే ఆధారపత్రాలు, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్లతో అందుబాటులో ఉండాలని తెలిపారు.

పార్కు పనుల పరిశీలన



పార్కు పనులు పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

రాజాం: పట్టణంలోని బొబ్బిలి జంక్షన్‌లో ఉన్న ఎర్రవాని చెరువు పార్కు అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బ్యూటీషియన్ అండ్ గ్రీనరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రూ.1.13 కోట్ల అంచనా వ్యయంతో పనులు జరుగుతున్నాయని, చెరువు గట్టు సరిహద్దు చుట్టూ కంచె వేయించే పనులు పూర్తయినట్లు పేర్కొన్నారు. వీలైనంత త్వరగా పార్కు పనులు పూర్తికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ప్రజారోగ్యమే లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు ఆరోగ్య భరోసానిస్తోంది. గ్రామగ్రామాన ఏర్పాటవుతున్న వైద్యశిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. బుధవారం శిబిరాలకు వచ్చిన రోగులకు వైద్యారోగ్య సిబ్బంది ఆరోగ్య తనిఖీలు చేసి, మెరుగైన వైద్యసేవలందించారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు, మందులు పంపిణీ చేశారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని జిల్లా కేంద్రాస్పత్రికి రిఫర్ చేశారు. ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్నారని, ఊరూరా అందుబాటులోని ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులు కోరారు.

–సాక్షి నెట్‌వర్క్



రేగిడి: నాయిరాలవలసలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కంబాల జోగులు



బొబ్బిలి: గోపాలరాయుడిపేటలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం



సంతకవిటి: సురవరంలో బీపీ తనిఖీ చేయించుకుంటున్న సర్పంచ్ షణ్ముఖరావు



వంగర: మద్దువలసలో వైద్యసేవలను పరిశీలిస్తున్న ఎంపీపీ సురేష్ ముఖర్జీ తదితరులు



తెర్లాం: వి.చిన్నయ్యపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరానికి హాజరైన రోగులు



రామభద్రపురం: రావివలసలో రోగులకు మందులు ఎలా వేసుకోవాలో చెబుతున్న వైద్యారోగ్య సిబ్బంది



బాడంగి: కోడూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీపీ గౌరి పక్కనే జెడ్పీటీసీ రామారావు



బాడంగి: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్



రేగిడి: నాయిరాలవలసలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరానికి హాజరైన రోగులు

వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని అడ్డుకోలేరు

- సానుభూతి కోసమే టీడీపీ డ్రామాలు
- రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
- పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, పక్కనే ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: టీడీపీ, జనసేన పార్టీలు ఎన్ని అలజడులు సృష్టించినా, రాద్ధాంతాలు చేసినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనాన్ని అడ్డుకోలేరని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ధీమా వ్యక్తంచేశారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మీనాయుడు అధ్యక్షతన జరిగిన పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథులుగా వారు హాజరై, పార్టీ శ్రేణులను దిశానిర్దేశం చేశారు. 2014 ఎన్నికల్లో టీడీపీ ఇచ్చిన హామీల్లో కనీసం ఆ పార్టీ నెరవేర్చలేదని, అయినా ఆ పార్టీ నాయకులు ప్రజల వద్దకు ఏం.. ముఖం పెట్టుకుని వెళ్తున్నారో అర్థకావడం లేదని విమర్శించారు. స్కిల్ స్కాంలో అరెస్టయిన చంద్రబాబుకు బెయిల్ కావాలని అడగకుండా మొత్తం కేసునే కొట్టేయాలని స్వాష్ పిటిషన్ వేయడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. అవినీతికి పాల్పడడంలోను, వ్యవస్థలను మేనేజ్ చేయడంలోనూ చంద్రబాబు సిద్ధహస్తుడని దుయ్యబట్టారు. బోగస్ కంపెనీల పేరిట కొన్ని రూ.కోట్ల నిధులు టీడీపీ ఖాతాలకు మళ్లించడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనన్నారు. అవినీతికి పాల్పడిన దొంగను జైల్లో పెడితే వైఎస్సార్ సీపీ కక్ష సాధిస్తుందనుకోవడం ఆ పార్టీ నాయకుల అవివేకమన్నారు. ప్యాకేజీ స్టార్ పవన్‌కల్యాణ్‌కు ప్యాకేజీ అందగానే చంద్రబాబుపై సానుభూతి చూపడంతో పాటు రెండు రోజులు పనికిరాని యాత్రలు చేస్తూ మూడోరోజు మరలా కనిపించకుండా పోతున్నారని ధ్వజమెత్తారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి దమ్మూధైర్యం ఉన్న నాయకుడు అని, తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో అలాంటి నాయకుడిని చూడలేదన్నారు. ఆయన చేసిన అభివృద్ధి, సంక్షేమంపై ఆయనకు నమ్మకం ఉంది కనుకనే తమను(ప్రజాప్రతినిధులు) ప్రజల వద్దకు పంపిస్తున్నారన్నారు. ఈ అభివృద్ధి పనులు చేశాం.. ఈ పథకాలు ఇచ్చాం.. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామని ప్రజల దగ్గరకు వెళ్లి, ఈరోజు చెప్పగలుగుతున్నామంటే దానికి కారణం సీఎం జగనన్న పనితనమేనన్నారు. ప్రజలకు మరింత మేలు జరగాలంటే జగనన్నే మళ్లీ సీఎం కావాలని, ఆ దిశగా ప్రజలు కూడా ఆలోచన చేస్తున్నారన్నారు. పేదల ముఖాల్లో చిరునవ్వు ఉండాలంటే తప్పనిసరిగా మళ్లీ సంక్షేమ ప్రభుత్వమైన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రావాల్సిందేనన్నారు. నవంబరు 1వ తేదీ నుంచి నిర్వహించనున్న వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలో) అనే కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని ఇంటింటికీ వెళ్లి, వివరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సీహెచ్ లక్ష్మణరావు, జెడ్పీటీసీ ఎ.సరస్వతి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయులు, పీఏసీఎస్ చైర్మన్ కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలి

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



ఇళ్ల నిర్మాణాలపై అధికారులతో సమీక్షిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

రేగిడి: అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమైన ఆయన జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంతవరకు నిర్మించిన ఇళ్లకు సంబంధించి, బిల్లుల చెల్లింపులు పూర్తి చేయాలని తెలిపారు. మండలంలో కొత్తగా ప్రతిపాదించిన 161 ఇళ్లను కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నిర్దేశిత గడువులోగా నిర్మాణాల పూర్తికి లబ్ధిదారులు చొరవ తీసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, హౌసింగ్ ఏఈ జగన్మోహనరావు, ఎంపీడీవో శ్యామలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

నా మట్టి నా దేశం ర్యాలీ



రాజాం: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: స్థానిక పట్టణంలో నా మట్టి నా దేశం ర్యాలీ బుధవారం నిర్వహించారు. విజయనగరం జిల్లా నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో ఎమ్మెల్యే కంబాల జోగులు పాల్గొని, కాసేపు మాట్లాడారు. ప్రతిఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని, దేశ సమగ్రత, అభివృద్ధి, ఐక్యతకు పాటుపడాలని పిలుపునిచ్చారు. మనమంతా భారతీయులమన్న భావన అందరిలో ఉండాలని, ఒకరి కష్టసుఖాల్లో మరొకరు పాలుపంచుకోవాలన్నారు. ప్రధాన రోడ్లు, ఇంటి పరిసరాలు, సాగునీటి చెరువులు, కాలువల వద్ద మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, నెహ్రూ యువ కేంద్రం బ్లాక్ కో–ఆర్డినేటర్ ఎం.వంశీ తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నా మట్టి నా దేశం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎంపీడీవో బాసూరి శంకరరావు మాట్లాడుతూ ప్రతీ పంచాయతీలో అమృత కలశాలల ద్వారా మట్టిని సేకరించి, వాటిలో మొక్కలు నాటాలన్నారు. అలాగే ప్రాథమిక స్థాయి నుంచే పిల్లల్లో దేశభక్తి పెంపొందించాలన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వి.శ్రీనివాసరావు, ఏపీవో కె.సాయిరాం, ఏపీఎం దది కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

రాజాం: మండలంలోని పొగిరి గ్రామంలో శ్రీశారదాదేవి నవరాత్రి ఉత్సవాల మండపం వద్ద గ్రామానికి చెందిన రైనా యూత్ సభ్యులు పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు బుధవారం నిర్వహించారు. క్లస్టర్ స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో రాజాం, పొందూరు, జి.సిగడాం మండలాల్లోని 13 పాఠశాలల విద్యార్థులు పాల్గొని, తమలోని ప్రతిభ చాటారు. రాజాంలోని ది సన్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రథమ బహుమతిని, పొందూరు మానసవేణి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ద్వితీయ బహుమతిని, రాజాం విశ్వశాంతి విద్యాలయం విద్యార్థులు తృతీయ బహుమతిని, జి.సిగడాం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు కన్సోలేషన్ బహుమతిని పొందినట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు సర్పంచ్ పొగిరి కృష్ణవేణి చేతులమీదుగా బహుమతులు అందజేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ఎస్ఈఏఎస్ సర్వేపై శిక్షణ

తెర్లాం: మండలంలో నవంబరు 3వ తేదీ నుంచి చేపట్టనున్న ఎస్ఈఏఎస్(స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే)ను ఉపాధ్యాయులంతా సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ సూచించారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీలో ఎంఈవో త్రినాథరావు ఆధ్వర్యంలో ఎస్ఈఏఎస్ సర్వే నిర్వహణపై మండలంలోని 21 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీడీవో మాట్లాడుతూ ఎటువంటి సర్వేల ద్వారా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు తెలుస్తాయన్న విషయం వివరించారు. ఎంఈవో త్రినాథరావు మాట్లాడుతూ సర్వే సక్రమంగా జరగడానికే శిక్షణ ఇస్తున్నామని, పక్కాగా సర్వే జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో–2 పాపారావు పాల్గొన్నారు.

కషాయ ద్రావణాలతో చీడపీడల నివారణ

రాజాం: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా తయారు చేసే వివిధ కషాయ ద్రావణాలతో వరి పంటలో వచ్చే చీడపీడలు, తెగుళ్లను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం ఎస్ఎఫ్ఏ రేఖ అన్నారు. మండలంలోని బొద్దాం గ్రామంలో వివిధ కషాయాల తయారీపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఆవుమూత్రంతో పాటు కానుగ, ఉమ్మెత్త, ఆముదం, బొప్పాయి, మునగ, మారేడు, పొగాకులు సేకరించి, పచ్చిమిర్చి, వెల్లుల్లి వంటి వాటిని అందులో కలిపి కషాయ ద్రావణాలు తయారు చేసి, పంటకు పిచికారీ చేయాలన్నారు. వీటి ద్వారా పెట్టుబడి ఖర్చు తక్కువ అని పంట దిగుబడి బాగుంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, సర్పంచ్ నక్క తవిటమ్మ, మాస్టర్ ట్రైనర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహార స్టాల్ సందర్శనలో ఎంపీపీ ఉమాలక్ష్మి

తెర్లాం: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతిఒక్కరూ రోజువారీ తినే ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూసుకోవాలని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి అన్నారు. మండలంలోని చిన్నయ్యపేట గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వద్ద ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను ఆమె బుధవారం సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా ప్రతిరోజూ ఆకుకూరలు, కాయకూరలు, పాలు, గుడ్లు వంటివి ఆహారంగా తీసుకోవాలన్నారు. ఎంపీపీ వెంట ఎంపీడీవో ఎస్.రామకృష్ణ, తహసీల్దారు రత్నకుమార్, ఈవోపీఆర్‌డీ నీలిమ, వి.చిన్నయ్యపేట, పాములవలస సర్పంచ్‌లు రాము, సుధఈశ్వరరావు, ఎంపీటీసీ సింహాచలం తదితరులు ఉన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు



ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని హొంజరాం పంచాయతీ పరిధిలో ఉన్న బూరాడపేటలో బుధవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతీ ఇంటికి మేలు జరిగేలా పథకాలు రూపొందించి, అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఆ పార్టీ నేతలు, జన్మభూమి కమిటీలు సూచించిన వారికే పథకాలు దక్కేవన్నారు. ఇప్పుడు అలా కాదని, అర్హులై ఉంటే చాలని, పథకాలు వారి వద్దకే వస్తున్నాయన్నారు. ప్రధానంగా రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, పథకాలు అందుతున్నాయన్నారు. ఆయా వ్యవస్థల సేవలకు దేశ వ్యాప్తంగా మంచి పేరుందన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, అధికారంలోకి తీసుకురావాలని, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్‌మోహనరావు, ఎంపీపీ ఎస్.మంజుల, సర్పంచ్ ఎస్.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. బుధవారం మండలంలోని చింతాడ గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం ద్వారా ప్రజలకు చేకూరిన మేలును వివరించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని, అన్ని వర్గాలకు మేలు జరిగేలా ఆయన రూపొందించి, అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 99 శాతం హామీలు నెరవేర్చడంతో పాటు సభలు, సమావేశాలు, సదస్సులు, బహిరంగసభల్లో ఆయన ప్రజలకు ఇచ్చిన మరెన్నో హామీలను నెరవేర్చారన్నారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, పథకాలు అందుతున్నాయన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరగలేదని ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. రానున్న ఎన్నికల్లోనూ సీఎం జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మి, జెడ్పీటీసీ సంకిలి శాంతకుమారి, పార్టీ నాయకుడు శంబంగి వేణుగోపాలనాయుడు, ఈవోపీఆర్‌డీ ఎ.భాస్కరరావు, సర్పంచ్ బంకురు తిరుపతిరావు పాల్గొన్నారు.

పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలి

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



లక్ష్మణనాయుడును సత్కరిస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే శంబంగి తదితరులు

రామభద్రపురం: వైఎస్సార్ సీపీ మరింత బలోపేతానికి కృషి చేయాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కొత్తగా పార్టీ మండల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అప్పికొండ లక్ష్మణనాయుడును ఎంపీ, ఎమ్మెల్యేలతో పా టు ఎంపీపీ లక్ష్మణరావు, జెడ్పీటీసీ సరస్వతి దుశ్శా లువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. పార్టీ అధిష్ఠానం అప్పగించిన బాధ్యతలను చక్కగా నిర్వర్తించాలన్నారు. పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్త లు, అభిమానులను సమన్వయం చేసుకుంటూ ముందుకు నడవాలన్నారు. కార్యక్రమంలో కొట్టక్కి గ్రామస్తులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.